క్లుప్తంగా

నాసా స్పేస్ కాంటెస్ట్‌కు విద్యార్థులు



నాసా స్పేస్ పోటీలకు ఎంపికైన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు: నాసా స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్ 2023–24 పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్టు శ్రీచైతన్య రీజియన్ ఇన్‌చార్జి పైల గోపీనాథ్ శనివారం తెలిపారు. ఈ పోటీలకు ఐదు ప్రాజెక్టులతో 36 మంది పాల్గొననున్నారని ఆయన తెలిపారు. విద్యార్థుల బృందాన్ని ఐడియల్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ రామ్మోహన్, ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ సుల్తానా, కో–ఆర్డినేటర్ జనార్దన్ అభినందించారు.

రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోట్‌క్లబ్: చిల్డ్రన్ డే సందర్భంగా రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సూర్యకళా మందిరంలో డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ నెల 14న స్థానిక సాంబమూర్తినగర్‌లోని రోటరీక్లబ్‌లో పాటలు, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు సూర్యం, అనుపమ, సీఎస్ రవితేజ, అంకిత్ జైన్, కృష్ణమోహన్, భాస్కర్ జేయేష్, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు విస్తృతం

- డీపీటీవో శ్రీనివాసరావు



ర్యాలీలో పాల్గొన్న డీపీటీవో శ్రీనివాసరావు తదితరులు

కాకినాడ: ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా జరుగుతున్న కార్గో డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేయాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. కాకినాడ డిపో ఆధ్వర్యంలో శనివారం కాంప్లెక్స్ ఆవరణలో డోర్ డెలివరీ మాసోత్సవాల ర్యాలీ జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రయాణికులు, ప్రజలు ఇచ్చే పార్శిళ్లను సకాలంలో గమ్యస్థానానికి చేర్చడం ద్వారా మన్ననలు పొందాలన్నారు. తక్కువ ఖర్చుతో వేగంగా పార్శిల్స్‌ను అందించే ఈ విధివిధానాలను, సౌకర్యాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఆయన సూచించారు. డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ, మాలం బాషా, ఉద్యోగులు పాల్గొన్నారు.

అద్భుత ఘట్టం మహాశక్తి యాగం

- 14 నుంచి శ్రీపీఠంలో ప్రారంభం
- పరిపూర్ణానంద స్వామి పర్యవేక్షణలో శతకోటి లలితా కుంకుమార్చన
- కోటి బగళాముఖి జప, తర్పణ, హోమాలు



మహాశక్తి యాగంలో శత కోటి లలితా కుంకుమార్చన కోసం 12వేల మంది మహిళలు కూర్చునేలా భారీ షెడ్

కాకినాడ రూరల్: స్థానిక శ్రీపీఠంలో మహాశక్తి యాగం నిర్వహించేందుకు పరిపూర్ణనంద స్వామిజీ పర్యవేక్షణలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కార్తిక మాసం అంతా పీఠంలో కొలువైన ఐశ్వర్యాంబిక సమేత సుందరేశ్వరస్వామి దివ్య సన్నిధిలో 14వ తేదీ మంగళవారం నుంచి డిసెంబరు 13 వరకు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఇందు కోసం సుమారు 12 వేల మంది కూర్చుని కుంకుమ పూజలు చేసేలా భారీ షెడ్, గుడిని తలపింపజేసేలా యాగశాల, బగళాముఖి అమ్మవారి కోసం గుడి, భక్తులకు భోజన వసతి కోసం మరో షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మహాశక్తి యాగంలో భాగంగా శతకోటి (వంద కోట్ల) లలితా కుంకుమార్చన, కోటి బగళాముఖి జప, తర్పణ హోమాలు, 27 నక్షత్రాలకు మహాశాంతి, కోటి దీపోత్సవం, అతిరుద్ర యాగం నిర్వహించనున్నారు. సుమారు 10 వేల మంది మహిళలు 30 టన్నుల కుంకుమతో వంద కోట్ల లలితా కుంకుమార్చనలు చేపట్టనున్నారు. కుంకుమార్చనకు వచ్చే మహిళలకు గుర్తింపు కార్డులు కేటాయించారు.



మహాశక్తి యాగం కోసం ఏర్పాట్లు

జగన్ పాలన జనరంజకం

- ప్రజల ముందుకు వెళ్లి చేసినవి చెప్పే ధైర్యం మాకే ఉంది
- వైఎస్సార్ సీపీ నేత, జేఎన్‌టీయూకే ఈసీ సభ్యుడు బెజవాడ



కాకినాడ రూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్నగా సీఎం జగన్ సంక్షేమ పథకాలు వర్తింపజేసి జన రంజకమైన పాలన సాగిస్తున్నారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మరో సారి అధికారం చేపడుతుందని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, తిమ్మాపురం సర్పంచ్, జేఎస్‌టీయూకే ఈసీ సభ్యుడు బెజవాడ వీరవెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, పచ్చ మీడియా అవాకులు, చవాకులతో ప్రభుత్వాన్ని తక్కువ చేసి చూపించాలని చూస్తోందని, ప్రజలు గత ప్రభుత్వంలో చంద్రబాబు పనితీరు, ప్రస్తుతం సీఎం జగన్ పనితీరును గమనిస్తున్నారన్నారు. తిమ్మాపురంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించి టీడీపీ నాయకులు శుక్రవారం మీడియా సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. సీఎం జగన్ పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలతో పాటు వారికి సముచిత స్థానం కల్పించారన్నారు. తమ అనుకూల మీడియా, సోషల్ మీడియా ఉందని టీడీపీ నాయకులు ఇష్టమొచ్చినట్టు ఆరోపణలు చేస్తే ఊరుకోబోమన్నారు. నిర్మాణాత్మక ఆరోపణలను స్వీకరిస్తామన్నారు. తమ నాయకుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నాయకత్వంలో 2024లో కాకినాడ రూరల్‌లో విజయం సాధిస్తామన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



మౌలానా అబుల్ కలాం అజాద్‌కు నివాళులర్పిస్తున్న డీఆర్వో శ్రీధర్‌రెడ్డి, ముస్లిం పెద్దలు, నాయకులు

కాకినాడ సిటీ: స్వాతంత్య్ర సమరయోధుడిగా, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు అమూల్యమైనవని డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమశాఖ అధికారులతో కలసి ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహమాన్ ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్టూడెంట్స్ ఫ్రెషర్స్ డే

- హాజరైన ఎస్పీ, నన్నయ వీసీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, చిత్రంలో వీసీ పద్మరాజు

బాలాజీచెరువు: ఉన్నత విద్యాప్రమాణాలు కలిగిన విద్యా సంస్థగా ఆదిత్య కళాశాల పేరు సాధించినదని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఫ్రెషర్స్‌డే–23 నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ఎదిగి లక్షలాది మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిందన్నారు. మరో ముఖ్య అతిథి నన్నయ వర్సిటీ వీసీ కొప్పిరెడ్డి పద్మరాజు మాట్లాడుతూ సాంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా ఉపాధి ఇచ్చే కోర్సులు ప్రవేశపెట్టి డిగ్రీ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ సంస్థలో లక్షలు వేతనాలు పొందేలా కృషిచేయడం అభినందనీయమన్నారు. ప్రత్యేక ఆహ్వానితునిగా వచ్చిన జింబాబ్వే రిపబ్లిక్ రాయబారి కార్యాలయ విద్యారంగ సలహాదారు నుక్యుబ్‌లవ్‌మోర్ మాట్లాడుతూ ఏటా విదేశీ విద్యార్థుల సంఖ్య పెరగడంపై విద్యార్థులకు వీరు అందిస్తున్న సౌకర్యాలు, విద్యను బట్టి తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, ప్రిన్సిపాల్ కర్రి కరుణ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణలో యువకుడికి గాయాలు

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్ సమీపంలో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కాకినాడ సూర్యారావుపేటకు చెందిన 19 ఏళ్ల జోష్టిశ్రీ జశ్వంత్ గాయాలపాలయ్యాడు. కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీజీహెచ్ ఆవరణలో స్వామి సాయి అనే యువకుడు తాను ప్రేమించిన యువతితో మాట్లాడుతుండగా ఆమె మాజీ ప్రేమికుడు చందు వారిని గమనించి స్వామిసాయితో వాగ్వాదానికి దిగాడు. అనంతరం ఇరువురు యువకుల తరఫు నుంచి వారి స్నేహితులు వచ్చి ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో చందు స్నేహితులు జశ్వంత్‌పై ఇనుపరాడ్డులతో దాడి చేశారు. క్షతగాత్రుడిని స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు.

భక్తులకు ప్రాధాన్యమివ్వడం ప్రశంసనీయం

బోట్‌క్లబ్: ప్రాశస్త్యం కలిగిన బాలాత్రిపుర సుందరి అలయంలో భక్తులకు దర్శనంతో పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఆలయ పాలకమండలి అధిక ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమని విజయవాడ ఉత్తరాది మఠాధికారి సుధాపండితుడు సుమంతాచార్ పాటిల్ (నాసిక్) అన్నారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ పెద్ది రత్నాజీ ఘనస్వాగతం పలికారు. సుమంతాచార్‌ను ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం శేష వస్త్రంతో సత్కరించారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

కరప: మండలంలోని బాణసంచా విక్రయ దుకాణాలను శనివారం ఎస్సై ఎస్.రామకృష్ణ, ఏఎస్సై వి.సూరిబాబు, పీసీ పి.వెంకట్రావు తదితర సిబ్బందితో తనిఖీచేసి, పలు సూచనలిచ్చారు. కరప, వేళంగి, నడకుదురు, గొర్రిపూడి, వేములవాడ తదితర గ్రామాల్లో వారు పర్యటించారు. దుకాణాల వద్ద నీళ్ల డ్రమ్ములు, ఇసుక ఉంచారో లేదో చూశారు.

దుస్తులు, బాణసంచా పంపిణీ

నడకుదురులోని జనావళి వృద్ధుల ఆనాథాశ్రమంలో శనివారం దేవదాయశాఖ జేసీ, ద్వారకాతిరుమల ఆలయం ఈఓ వేండ్ర త్రినాథరావు సమకూర్చిన దుస్తులు, బాణసంచా సామగ్రి, పండ్లు, స్వీట్లు, నబ్బులు, పేస్టులు, మందులు పంపిణీ చేశారు.

డయల్ యువర్ డీఎంకు వినతులు

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణికులు ఫోన్ ద్వారా పలు సమస్యలను కాకినాడ ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్‌కు వివరించారు. శనివారం జరిగిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం ద్వారా ఆరుగురు ఫోన్ ద్వారా సమస్యలు వివరించారు. కడప రూట్‌లో కొత్త బస్సులు నడపాలని, ఒమ్మంగి వరకే నడుపుతున్న శాంతి ఆశ్రమం బస్సులను శాంతి ఆశ్రమం వరకూ కొనసాగించాలని కోరారు. బస్సులలో 10 రూపాయల నాణేలను తీసుకోవడం లేదని మరో ప్రయాణికుడు డీఎంకు వివరించారు. ద్వారపూడి మీదుగా హైదరాబాద్ బస్సులను నడపాలని ఒకరు, ప్రొద్దుటూరు వరకు బస్సులను పునరుద్ధరించాలని మరొకరు కోరారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని డీఎం హామీ ఇచ్చారు.



డిపో మేనేజర్ మనోహర్

గృహకల్పకు కొత్త కళ

- రూ.కోటితో మరమ్మతులకు శ్రీకారం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చొరవతో పనులు

కాకినాడ: రాజీవ్ గృహకల్ప ఫ్లాట్లు సరికొత్త హంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. మరమ్మతులకు గురైన అపార్ట్‌మెంట్ల సముదాయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో డైరీఫారం సెంటర్, దుమ్ములపేటలోని రాజీవ్ గృహకల్ప ఇళ్లు త్వరలోనే కళకళలాడనున్నాయి. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2007లో ఈ అపార్ట్‌మెంట్లను పేదలకు పంపిణీ చేశారు. స్థానిక డైరీఫారం, దుమ్ములపేట ప్రాంతాల్లో 160 బ్లాక్‌లలో ఈ ఇళ్లు ఉన్నాయి. ఒకొక్క బ్లాక్‌కు 24 ఇళ్ళు చొప్పున మొత్తం 3,840 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. కాలం గడిచేకొద్దీ కొన్ని ఇళ్లు మరమ్మతులకు గురయ్యాయి. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆ ప్రాంతానికి వెళ్లినపుడు స్థానికులు తమ ఇళ్ల దుస్థితిని ఆయనకు వివరించారు. దీనికి ఆయన వెంటనే స్పందించి మరమ్మతులు చేయించి, పెయింటింగ్‌లు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. నగరపాలక సంస్థతోపాటు ఇతర మార్గాల ద్వారా రూ.కోటి అంచనా వ్యయంతో పనులు చేయిస్తున్నారు. దీంతో రాజీవ్ గృహకల్ప ప్రాంగణాలన్నీ సర్వాంగ సుందరంగా మారనున్నాయి. ప్రాథమికంగా 10 బ్లాక్‌లలో పనులకు శ్రీకారం చుట్టారు. మిగిలినవి వచ్చే ఫిబ్రవరి, మార్చి నాటికి పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం డైరీఫారం, దుమ్ములపేట ప్రాంతాల్లోని మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి.



మరమ్మతులకు గురై రంగులు లేక దుర్భరంగా ఉన్న రాజీవ్‌గృహకల్ప ఫ్లాట్లు



మరమ్మతులు చేసి రంగులు వేసిన అనంతరం కళకళలాడుతున్న రాజీవ్ గృహకల్ప ఫ్లాట్లు

'గడప గడప'తో పరిష్కారం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం వల్ల రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్ల సమస్యకు పరిష్కారం లభించింది. అతి త్వరలోనే రాజీవ్ గృహకల్ప నివాస సముదాయాల రూపురేఖలు మారనున్నాయి.

– ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే

కొత్త ఇళ్లలా ఉన్నాయ్...



పేదరికం వల్ల ఇళ్లకు మరమ్మతులు చేసుకోలేకపోయాం. రంగులు వేయించలేకపోయాం. ఎమ్మెల్యేకు సమస్య చెప్పగానే వెంటనే పరిష్కారం దొరికింది. అధికారులతో సంప్రదించి వేగంగా పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులన్నీ చురుగ్గా సాగుతున్నాయి. లబ్ధిదారులు తరఫున సంతోషం వ్యక్తం చేస్తున్నాను.

– డి.శ్రీనివాస్, రాజీవ్‌గృహకల్ప, కాకినాడ